

రెచ్చిపోతున్న దొంగలు
వ్యవసాయ పొలాల వద్ద చోరీలకు పాల్పడుతున్న దొంగలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. 10లో▸



ప్రాచీన కళలను ప్రోత్సహిద్దాం
ప్రాచీన కళలను ప్రోత్సహించాలని అంబేడ్కర్ చేయూత ఫౌండేషన్ చైర్మన్ తుప్పలి ఆశోక్‌కుమార్ కోరారు. 10లో▸



అంబేడ్కర్ కృషితోనే..
అంబేడ్కర్ అందరి వాడని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. కొర్విచెడ్‌లో శనివారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. 11లో▸

న్యూస్‌రీల్

'అమ్మ'కు వందనం



ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: పిల్లలందరినీ కంటికి రెప్పలా కాపాడే మాతృమూర్తులకు ఎస్పీ కోటిరెడ్డి మదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. 'పదాలు తెలియని పెదవులకు అమృత వ్యాఖ్యం అమ్మ.. ఆమె చల్లని ఒడిలో మొదలైంది ఈ జన్మ. కనులు తెరిచిన క్షణం నుంచి బంధం కోసం బాధ్యత కోసం.. కుటుంబం కోసం అందరినీ కనుపాపలా లాలించి, ఆత్మీయత పంచి, తనవారి కోసం అహర్నిశలు కష్టపడి, వారి భవిష్యత్తును నందనవనం చేస్తున్న అమ్మలందరికీ చేతులెత్తి మొక్కుతున్నా' అన్నారు.

ప్రొటోకాల్ పాటించని వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ అనసూయ

దోమ: ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అనసూయ కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈనెల 10న దోమ, గుండాల, దాదాపూర్ గ్రామాల్లో డీసీఎమ్మెస్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని, ఈ విషయమై తనకు కనీస సమాచారం ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేవలం జెడ్పీటీసీతోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై పూర్తిస్థాయి విచారణ చేపట్టి సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

'శ్రీకృష్ణారాధన' పుస్తకావిష్కరణ

అనంతగిరి: ప్రముఖ కవి లాల్‌రెడ్డి రాసిన 'శ్రీకృష్ణారాధన కంద పద్య మందారాలు' పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ సలహా సంఘం సభ్యుడు డాక్టర్ రఘు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శనివారం వికారాబాద్ సమీపంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లాల్‌రెడ్డి రచించిన శ్రీకృష్ణారాధన పుస్తకం భక్తిమార్గంతో పాటు సాహిత్య చందస్సును చాటి చెబుతుందని ప్రశంసించారు. లాల్‌రెడ్డి రచన శైలి పోతన మహాకవిని పోలి ఉందన్నారు. ఉత్తర భారతంలో శ్రీకృష్ణుడి భక్తులు ఎక్కువగా ఉంటారని, ఈ పుస్తకాన్ని హిందీ, సంస్కృతం భాషల్లోకి అనువదిస్తే తెలంగాణ వికారాబాద్ కవుల సాహిత్య గొప్పదనం యావత్ భారతావనికి తెలుస్తుందని సూచించారు. ప్రముఖ శతావధాని డాక్టర్ మలుగ అంజయ్య మాట్లాడుతూ.. కవి వాక్కుకు ఉన్న బలాన్ని సోదాహరణంగా వివరించి చెప్పారు. ఈ కార్యక్రమంలో కవులు దొరవేటి చెన్నయ్య, మల్లారెడ్డి, బందెప్పగౌడ్, విశ్వనాథం, రాజు, ఆశీర్వాదం, వడిచర్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వం

ఇబ్రహీంపట్నం రూరల్: అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ వంగేటి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పోల్కంపల్లిలో శనివా రం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ఇస్తోందని, సకాలంలో ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు అందజేస్తోందన్నారు. రైతులు పండించిన పంటలను అమ్ముకోవడానికి మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు తెరిచినట్లు చెప్పారు. రైతుబంధు, రైతు బీమా పథకాలను ప్రవేశపెట్టి కేసీఆర్ రైతు బాంధవుడయ్యాడని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ అంజిరెడ్డి, సర్పంచ్ అండాలు, ఎంపీటీసీ చెరుకూరి మంగ, పీఏసీఎస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

బాధ్యులెవరు?

టెన్త్, ఇంటర్ ఫలితాలపై విమర్శల వెల్లువ

- విద్యాశాఖ పనితీరుపై తల్లిదండ్రులు, ప్రజా సంఘాల ఆగ్రహం
- కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేత
- పూర్తి స్థాయి సిబ్బంది ఉన్న స్కూళ్లలో సైతం ఎక్కువ మంది ఫెయిల్

వికారాబాద్: ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాల్లో మన జిల్లా అట్టడుగు స్థానాల్లో నిలవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాశాఖ పనితీరుపై ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రులతో పాటు ప్రజా సంఘాలు, విద్యాభిమానుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ విషయమై ప్రజా సంఘాలు, పలు పార్టీల ఆధ్వర్యంలో ఏకంగా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు, ఫిర్యాదులు అందజేయడం వ్యతిరేకతకు అద్దం పడుతోంది.

సమీక్షకూ సమయం లేదు!

గతంలో ఉమ్మడి జిల్లాల వారీగా వచ్చే ఫలితాల సమయంలో రంగారెడ్డి అర్బన్ ఏరియాతో కలిపి.. మన ప్రాంతం కూడా టాప్ ఫైవ్‌లో కనిపించేంది. కొత్త జిల్లా వికారాబాద్‌లో కరోనా బ్యాచ్‌లు మినహాయిస్తే అటు ఇంటర్ ఇటు టెన్త్‌లో ఒక్కసారి కూడా 24లోపు స్థానాల్లో నిలవలేదు. ఈసారి మరింత దయనీయమైన స్థాయికి దిగజారింది. ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో మన జిల్లా రాష్ట్ర స్థాయిలో 32వ స్థానానికి పడిపోగా.. సెకండియర్‌లోనూ 28వ స్థానానికే పరిమితమైంది. ఇక పదో తరగతి ఫలి తాల్లో ఏకంగా రాష్ట్రంలోనే చివరి స్థానంలో నిలి చింది. ఈ ఫలితాలతో జిల్లా యంత్రాంగం, ఉన్నతాధికారులు, విద్యాశాఖ, తలదించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంత జరిగినా జిల్లా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం, అసలు ఈ విషయంతో తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించడం విడ్డూరం.ఇదిలా ఉండగా కనీసం ఉన్నతాధికారులు సైతం ఇప్పటివరకు ఫలితాలపై సమీక్ష నిర్వహించిన పాపానపోలేదు.

5,432 మంది ఫెయిల్

ఇంటర్ ఫస్టియర్‌లో మొత్తం 7,859 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో 3,618 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత శాతం 46గా నమోదైంది. సెకండియర్‌లో 6,459 మంది పరీక్షలు రాయగా.. ఇందులో 3,909 మంది పాసయ్యారు. 60శాతం ఉత్తీర్ణత లభించింది. టెన్త్‌లో ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి 13,399 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా.. 7,967 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ఏకంగా 5,432 మంది ఫెయిలయ్యారు. ఇలా విద్యాశాఖ దారుణమైన వైఫల్యాలను మూటగట్టుకుంది. ఇక్కడ అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. వారంలో ఎనిమిది పీరియడ్లు క్లాస్ తీసుకోవటంతో పాటు నిత్యం ఐదు పీరియడ్లను పర్యవేక్షించాల్సిన డీఈఓ ఇవేవీ పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. అతి తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో సైతం ఫలితాలు అట్టడుగున నిలవడం విద్యాశాఖలో దుస్థితిని సూచిస్తోంది.



ఫలితాలను సమీక్షించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ప్రజాసంఘాల నేతలు (ఫైల్)

పూర్తిస్థాయి సిబ్బంది ఉన్నా..

పూర్తిస్థాయి సిబ్బంది ఉన్న స్కూళ్లలోనూ 20నుంచి 30శాతం ఫలితాలే రావడం గమనార్హం. కొన్ని పాఠశాలల్లో ఒక్కో ఉపాధ్యాయుడు ఒక్కో స్టూడెంట్ చొప్పున కూడా పాస్ చేయించలేకపోయారు.

- వికారాబాద్ మండలం జైదుపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఇద్దరు విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా ఒక్కరు మాత్రమే పాసయ్యారు.
- ఆలంపల్లిలో 18 మందికి గాను నలుగురు పాసయ్యారు.
- ధారూరు బాలికల పాఠశాలలో 16 మందికి గాను ఇద్దరు ఉత్తీర్ణత సాధించారు.
- ధారూరు కేజీబీవీలో 34 మందిలో ఐదుగురు పాసయ్యారు.
- ఎమ్మెల్యే స్వగ్రామమైన కేరెళ్లిలో పది మందికి ఐదుగురు ఉత్తీర్ణులయ్యారు.
- మోమిన్‌పేట బాలుర పాఠశాలలో 19 మందిలో కేవలం ఒక్కరే ఉత్తీర్ణత సాధించారు.
- మొరంగపల్లిలో 14 మందికి ముగ్గురు పాసయ్యారు.
- బంట్వారం మండలం సల్బత్తాపూర్‌లో నలుగురు విద్యార్థులు ఉండగా అందరూ ఫెయిలయ్యారు.
- తొర్మామిడి స్కూల్‌లో 11 మందికిగాను ఒక్కరు పాసయ్యారు.
- మర్పల్లి ఉర్దూ మీడియం స్కూల్‌లో పది మందికి గాను ఒక్కరు కూడా పాస్ కాలేదు.
- కోట్‌మర్పల్లిలో ఐదుగురికి గాను ఒక్కరు ఉత్తీర్ణత సాధించారు.
- కల్కోడ పాఠశాలలో 12 మందిలో ఇద్దరు పాసయ్యారు.
- గనాపూర్ స్కూల్‌లో 11 మందికి ఒక్కరు ఉత్తీర్ణత సాధించారు.
- కొత్లాపూర్‌లో 18 మందికి ఇద్దరు మాత్రమే పాసయ్యారు.
- పరిగి, దోమ మండలాల పరిధిలోని నంబర్ వన్ ఉన్నత పాఠశాల, నంబర్ టు హైస్కూల్, మాదారం, బొంపల్లి, దోమ ఉన్నత పాఠశాలల్లో పూర్తి స్థాయి సిబ్బంది ఉన్నప్పటికీ 30నుంచి 40శాతం మంది విద్యార్థులే పాసయ్యారు.

సహజ సంపదను పరిరక్షించుకుందాం

సాక్షి, సిటీబ్యూరో: కుతుబ్ షాహీ టూంబ్స్‌తో పాటు దక్కన్ పార్క్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పర్యాటక, క్రీడా, సాంస్కృతిక, పురావస్తు శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. శనివారం ఆగాఖాన్ ట్రస్ట్ సాంస్కృతిక విభాగం ప్రతినిధులతో కలిసి కుతుబ్ షాహీ టూంబ్స్, డెక్కన్ పార్క్ అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహజ సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా యునెస్కో అవార్డు ఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆ మెట్ల బావి పనులను తనిఖీ చేశారు.

దొరల పాలన పోవాలి

- ఇందిరమ్మ రాజ్యం రావాలి
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

కొందుర్గు: రాష్ట్రంలో దొరల పాలన పోవాలని, ఇందిరమ్మ రాజ్యం రావాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శనివారం షాబాద్ మండలం నుంచి కొందుర్గు మండలం రేగడిచిల్కమర్రికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో పేద ప్రజలకు అనేక పథకాలు అందించినట్టు చెప్పారు. భూమిలేని పేదలకు సీలింగ్, అసైన్డ్ భూములు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. దుర్మార్గపు కేసీఆర్ పేదల భూములను లాక్కొని బహుళ జాతి సంస్థలకు ధారాదత్తం చేస్తున్నాడని విమర్శించారు. తెలంగాణ ఏర్పడితే నిధులు, నీళ్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయంటే అప్పటి కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఇచ్చారన్నారు. ఇచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పులపాలు చేసిండు తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో బహుళార్థక సాధక ప్రాజెక్టులు నిర్మించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసింది కాంగ్రెస్ అన్నారు. తెలంగాణ ఏర్పడితే కుర్చీ వేసుకొని కూర్చొని లక్ష్మీదేవిపల్లి వద్ద పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మిస్తానని నమ్మించాడన్నారు. తొమ్మిదేళ్లలో ప్రాజెక్టు నిర్మించడానికి కుర్చీ దొరకడం లేదా, లేక కుర్చోవడానికి స్థలం దొరకడం లేదా అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు ఇవ్వడంతోపాటు ప్రతినెల బియ్యం, 9 రకాల సరుకులు అందిస్తామన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, నిరుద్యోగులకు రూ.4 వేల భృతి, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు, ఇళ్లు లేని కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, రూ.5 లక్షలతో ఇల్లు నిర్మిస్తామమని, ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఉచిత ఇంగ్లిష్ మీడియం విద్య అందిస్తామన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు కృష్ణారెడ్డి, కావలి రాజు, నాయకులు విజయ్ కుమార్, పురుషోత్తంరెడ్డి, జితేందర్ రెడ్డి, మల్లేశ్‌గౌడ్, అంజిరెడ్డి, బాబర్‌ఖాన్, రఘు, వజ్రమ్మ, నరేందర్, నాగమణి, రజిత, గోవర్ధన్‌గౌడ్, నర్సింలు, ద్విజేందర్, రవి, రాజు పాల్గొన్నారు.



రేగడిచిల్కమర్రిలో రైతులతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

కళలు స్వేచ్ఛగా వికసించాలి



నూతన కమిటీ ప్రతినిధులతో మల్లారెడ్డి, చెన్నయ్య తదితరులు

- కవులు దొరవేటి చెన్నయ్య, తూర్పు మల్లారెడ్డి
- అనంత సాహిత్య, సాంస్కృతిక వేదిక ప్రతినిధుల ఎన్నిక

అనంతగిరి: వికారాబాద్ కేంద్రంగా మన సాహిత్యం, సంస్కృతిని విశ్వవ్యాప్తం చేద్దామని ప్రముఖ కవి, అనంత వేదిక రూపకర్త దొరవేటి చెన్నయ్య అన్నారు. ఈమేరకు శనివారం వికారాబాద్ సమీపంలోని బుగ్గ రామలింగేశ్వరాలయంలో అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక నూతన కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కవులకు, రచయితలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఎంతోమంది మహాకవులు చరిత్ర పుటల్లో తమ స్థానాన్ని పదిలం చేసుకున్నారని తెలిపారు. ఇలాంటి తెలంగాణ ప్రాంతంలోని వికారాబాద్ జిల్లాకు సాహిత్య చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాల్లో ప్రత్యేక స్థానం ఉందన్నారు. జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రను జిల్లాలోని కవులు, రచయితలు, కళాకారులను వెలికితీసి భావితరాలకు అందించాలన్నారు. అందుకు అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వెన్నుదన్నుగా నిలుస్తుందని స్పష్టం చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తూర్పు మల్లారెడ్డి మాట్లాడుతూ.. తమ రచనలతో పాటు సామాజిక అంశాలు, అభివృద్ధి ఇలా అన్ని అంశాలపై సమన్వయ దృష్టితో ముందుకు సాగాలని సూచించారు. కవిత్వం, కళలు స్వేచ్ఛగా వికసించాలని ఆకాంక్షించారు. లోకహితం కోసం పురోగమించాలనేదే అనంత సంస్థ నినాదం అని పేర్కొన్నారు. కవుల, మహనీయుల జయంతి వేడుకలు నిర్వహించడం, కవిత్వ రచనలో శిక్షణ ఇవ్వడం, యువ కవులను వెలికి తీయడం, కొత్త రచనలను ప్రోత్సహించడం తమ యోజన అని తెలిపారు. అనంతరం నూతన కమిటీ సమావేశం నిర్వహించారు.

నూతన కమిటీ..

జిల్లాలోని కవులతో అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక పేరున నూతన కమిటీని ఎన్నుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడిగా డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా బీపీ నర్సింలుగుప్తా, అధ్యక్షుడిగా బొబ్లాద్ రాఘవేంద్రచార్యులు, ఉపాధ్యక్షుడిగా వడిచర్ల సత్యం, ప్రధాన కార్యదర్శిగా ఆశీర్వాదం, కోశాధికారిగా మున్నూరు రాజు, సహాయ కార్యదర్శిగా సుధాకర్‌గౌడ్, సాంస్కృతిక కార్యదర్శిగా లాల్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా అంజిలప్ప, మహిళా కార్యదర్శిగా అనురాధ, కార్యాలలయ నిర్వాహకులుగా దివాకరశాస్త్రి, కార్యవర్గ సభ్యులుగా నర్సింలు, వెంకటేశ్, శ్రీనివాస్, కమలేశ్, రామచంద్రుడు, ప్రసాద్, రెడ్యా రాథోడ్, కరణం మాణిక్‌రావు, వెంకటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గురునానాక్ విద్యాసంస్థలపై చర్యలకు డిమాండ్

ఇబ్రహీంపట్నం: విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్న గురునానక్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పుప్పల శాంతికుమార్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూనివర్సిటీ అనుమతులు రాకున్నా విద్యార్థులను చేర్చుకుని లక్షలాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. విద్యార్థులు, పిల్లల జీవితాలపై ఆందోళన చెందుతున్న తల్లిదండ్రుల తరఫున న్యాయబద్ధంగా ప్రశ్నిస్తుంటే అక్రమ కేసులు బనాయించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని మండిపడ్డారు. యూనివర్సిటీ పేరుతో అక్రమ దందా,ప్రత్యేక తరగతుల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న గురునానక్ కళాశాలను సీజ్ చేయాలని.. యాజమాన్యంపై ఎస్సీ, ఎస్టీ క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకునే వారిని ఎట్టి పరిస్థితిలోనూ వదలబోమన్నారు. కార్యక్రమంలో పట్నం మున్సిపాలిటీ బీజేవైఎం అధ్యక్షుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో కన్నడ జోష్

కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. డీసీసీ నేతలతో పాటు పార్టీ నాయకులు సంబరాల్లో మునిగితేలారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. పలు చోట్ల విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో కూడా అధికారం తమదేనని ధీమా వ్యక్తంచేశారు.



ధారూరు: మండల కేంద్రంలో కాంగ్రెస్ నేతల సంబరాలు

- కర్ణాటక ఎన్నికల ఫలితాలపై పార్టీ శ్రేణుల సంబరాలు
- సరిహద్దు గ్రామాల్లోనూ పార్టీకి అండగా నిలిచిన ఓటర్లు
- సెడంలో శరణప్రకాశ్ పాటిల్ ఘన విజయం
- నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన మాజీ మంత్రి
- బీజేపీ అభ్యర్థిపై 43,561 ఓట్ల మెజార్టీ

తాండూరు/బషీరాబాద్: మన జిల్లాకు ఆనుకుని ఉన్న కర్ణాటకలోని సరిహద్దు గ్రామాలు కాంగ్రెస్‌కు జై కొట్టాయి. సేడం నియోజకవర్గంలో కాంగ్రెస్ హవా కొనసాగింది. ఇక్కడ 13 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలువగా.. కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. సిట్టింగ్, బీజేపీ అభ్యర్థి రాజ్‌కుమార్ పాటిల్‌పై కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్ 43,561 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. జేడీఎస్ (జనతాదల్ సెక్యూలర్) పార్టీ నుంచి పోటీ చేసిన బాలరాజ్ గుత్తేదార్ 21,024 ఓట్లు సాధించగా, గాలి జనార్దన్‌రెడ్డి స్థాపించిన కల్యాణ్ రాజ్య ప్రగతి పక్ష పార్టీ అభ్యర్థి జి.లల్లేశ్‌రెడ్డి డిపాజిట్ కోల్పోయారు.

పల్లెల్లో పండుగ వాతావరణం

బషీరాబాద్ మండలానికి సరిహద్దుగా ఉన్న కన్నడ గ్రామాలైన ఆడ్కి, అయ్యాళం, కురుగుంట, హల్కోడ్, జెట్టూరు, పోతంగల్, నుడిగింద, కర్చెఖేడ్, రెబ్బన్‌పల్లి తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శరణప్రకాశ్‌కు భారీ మెజార్టీ లభించింది. గతంలో సెడం నుంచి మూడు సార్లు గెలుపొందిన ఆయన 2014లో కర్ణాటక వైద్యారోగ్య శాఖ మంత్రిగా పనిచేశారు. సేడం నుంచి బషీరాబాద్, తాండూరు వచ్చే అంతర్రాష్ట్ర రోడ్లను విస్తరించి ఇక్కడి ప్రజల మన్ననలు పొందారు. సరిహద్దు గ్రామాలకు చెందిన వందలాది మంది కన్నడవాసులు బషీరాబాద్ మండలంలో వ్యవసాయ భూములు కొనుగోలు చేశారు. ఇక్కడి వారికి కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో భూములు, బంధువులు ఉన్నారు. శరణ ప్రకాశ్ పాటిల్ భారీ మెజార్టీతో గెలవడంతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు టపాసులు పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. సరిహద్దు గ్రామాల తెలంగాణ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సైతం వేడుకల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో పేర్కొన్న ఐదు హామీలు గ్రామీణ ఓటర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలంగాణలోనూ ఇదే మేనిఫెస్టోను అమలు చేస్తారా..? లేదా చూడాల్సిందే.

ప్రధాన హామీలివే..

- రేషన్ కార్డు ఉన్న మహిళకు ప్రతినెలా రూ.2 వేల పెన్షన్.
- ఇంటింటికీ 200 యూనిట్ల ఉచిత కరెంటు.
- రేషన్ కార్డులో ఉన్న ప్రతీ సభ్యుడికి ఉచితంగా 10 కిలో బియ్యం.
- డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు రూ.3 వేల భృతి, డిప్లొమా(టెక్నికల్ చదువు) చేసిన నిరుద్యోగులకు రూ.1,500.
- ప్రతీ మహిళకు కన్నడ ఆర్టీసీలో ఉచిత ప్రయాణం.

కల్బుర్గిలో హస్తం హవా

సరిహద్దులోని కల్బుర్గి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను సాధించింది. శనివారం వెలువడిన ఫలితాల్లో 9 స్థానాలు ఉండగా.. సెడం, చితాపూర్, అళంద్ జెవర్గి, కల్బుర్గి దక్షిణ్, కల్బుర్గి ఉత్తర, అఫ్జల్‌పూర్ చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. చించోళీ, కల్బుర్గి రూరల్ స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. చించోళీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి సుభాష్‌రాథోడ్ బీజేపీ అభ్యర్థి డాక్టర్ అవినాష్ మధ్య చివరి రౌండ్ వరకు తీవ్ర పోటీ కొనసాగింది. చివరకు స్వల్ప ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే విజయం సాధించారు. చితాపూర్ అసెంబ్లీ స్థానంలో మల్లికార్జున్ ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గే బీజేపీ అభ్యర్థి మణికంఠరాథోడ్‌పై గెలుపొందారు. నిజాం నవాబుల ఆధీనంలో ఉన్న ఉన్న జిల్లాలను హైదరాబాద్- కర్ణాటక ప్రాంతంగా గుర్తించారు. ఆయా జిల్లాల్లో మొత్తం 31 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 20 కాంగ్రెస్, 7 బీజేపీ, 2 జేడీఎస్, 2 ఇతరులు సొంతం చేసుకున్నారు. ఈ ఫలితాలు తెలంగాణ ఎన్నికలపై ప్రభావం చూపుతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి

- మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగడంతోనే అభివృద్ధి సాధ్యమవుతోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని లెనిన్‌నగర్ రైతుబజార్ వద్ద రూ.30 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన మహిళా మండలి షాపింగ్ కాంప్లెక్స్, మంత్రాల చెరువు వద్ద రూ.20 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన చిన్న పిల్లల ఆట పరికరాలను శనివారం సాయంత్రం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మంత్రాల చెరువు సుందరీకరణలో భాగంగా పెద్దలు, చిన్నారులకు ఉపయోగపడేలా ఓపెన్‌జిమ్,ఆట పరికరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ముంపు ప్రాంతం ప్రస్తుతం ఎంతో అభివృద్ధి చెందిందని, అభివృద్ధికి సహకరించిన ప్రజాప్రతినిధులు,అధికారులు, స్థానికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి,డీఈ గోపీనాథ్, ఏఈ శ్రీనివాసులు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మంత్రాల చెరువు వద్ద చిన్నారులు, స్థానికులతో మంత్రి సబితారెడ్డి

క్లుప్తంగా

హత్యకాదు.. అనారోగ్యంతోనే మృతి

యాలాల: అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కమాల్‌పూర్ గ్రామంలో శనివారం జరిగింది. మృతి చెందిన వ్యక్తి ముందుగా హత్యకు గురయ్యాడనే ప్రచారం జరగడంతో అటు పోలీసులు, గ్రామస్తులు ఆందోళన చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన హరిజన్ బిచ్చప్ప(62) శుక్రవారం సాయంత్రం గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో డప్పు వాయించాడు. రాత్రి ఇంట్లో నిద్రించాడు. తెల్లారేసరికి విగతజీవిగా పడి ఉన్నాడు. మృతుడి చేతులపై రక్తం ఉండటంతో గ్రామస్తులు..బిచ్చప్పది హత్యగా భావించి పోలీసులకు సమాచారమిచ్చారు. తాండూరు రూరల్ సీఐ రాంబాబు, ఎస్‌ఐ అరవింద్ తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బిచ్చప్ప అనారోగ్యంతో రక్తంతో కూడిన వాంతి చేసుకొని మృతి చెందాడని తెలిపారు. మృతుడి ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని ఎస్‌ఐ పేర్కొన్నారు. అనంతరం తాండూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులతో శవపంచనామా నిర్వహించామన్నారు. మృతుడి భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాల్షియం కార్బైడ్ వాడితే చర్యలు



కాల్షియం కార్బైడ్‌తో మగ్గబెట్టిన మామిడి పండ్లు

మోమిన్‌పేట: పండ్లను కాల్షియం కార్బైడ్ వాడి మగ్గబెట్టే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని మోమిన్‌పేట ఎస్‌ఐ విజయప్రకాశ్ హెచ్చరించారు. ఉదయం ఆయన మండల కేంద్రంలోని చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తున్న తరుణంలో ఓ వాహనంలో మామిడి పండ్లు తరలిస్తున్నారు. కాగా వాటిని పరిశీలించగా కాల్షియం కార్బైట్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



మోటార్‌లో రాళ్లు వేయడంతో బోర్లను బయటకు తీయిస్తున్న రైతు (ఫైల్)

రెచ్చిపోతున్న దొంగలు

- పొలాల్లో కేబుల్స్, స్టార్టర్ల అపహరణ
- బెంబేలెత్తుతున్న అన్నదాతలు

దోమ: అకాల వర్షాలు.. సాగుకు భారీగా పెరిగిన పెట్టుబడులతో రైతులు అవస్థలు పడుతుంటే.. మరో సమస్య కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. దొంగలు పొలాల్లోని మోటార్లు, వాటికి బిగించే కాపర్ వైర్లను అపహరిస్తున్నారు. దీంతో వాటిని కాపాడుకోవడానికి పొలాల దగ్గరే నిద్రిస్తున్నారు. ఇటీవల మండల వ్యాప్తంగా ఈ తరహా దొంగతనాలు ఎక్కువ కావడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు.

రెండేళ్లుగా చోరీలు..

మండల వ్యాప్తంగా కేబుల్ వైర్లు, స్టార్టర్ల దొంగతనాలు జరుగుతున్నాయి. రెండేళ్ల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ పొలాలను టార్గెట్ చేసుకుని మోటార్లు, వాటికి ఉండే కేబుల్స్‌తో పాటు స్టార్టర్లను అపహరిస్తున్నారు. అంతేకాకుండా బోర్ల రంధ్రాల్లో మోటార్‌పై రాళ్లను సైతం వేసి ధ్వంసం చేస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన కౌషిక్ అనే రైతుకు వ్యవసాయ పొలంలో ఐదు బోర్లు ఉన్నాయి. ఐదు బోర్లలో గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు వేసి బోరు ధ్వంసం చేశారు. ఆ బోర్లను బాగు చేయించేందుకు సుమారు రూ.6 లక్షల వరకు ఖర్చు చేయాల్సివచ్చింది. అయినా ఫలితం దక్కలేదు. రాళ్లు వేయడం వల్ల మోటార్లు పాడై కొన్ని బోర్లు పూడుకుపోయాయి. నెల రోజుల నుంచి బొంపల్లి, ఐనాపూర్, దాదాపూర్, దిర్సంపల్లి, బాస్‌పల్లి, రాకొండ, ఊటుపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాలతో పాటు తదితర గ్రామాలలో సుమారు 100 మంది రైతులకు చెందిన బోరు మోటార్లకు ఉండే కాపర్ వైర్లు, స్టార్టర్ల బాక్సులను అపహరించారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి, పగళ్లు పొలాల దగ్గరే కాపాలా ఉంటూ కేబుల్స్‌ను కాపాడుకుంటున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

మోటార్లు, స్టార్టర్లు, కేబుల్స్ వైర్లను దొంగిలిస్తుండటంతో రైతులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. కానీ పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. పగటి పూట పక్షుల వేట కోసం వస్తున్న కొందరు వ్యక్తులే దొంగతనాలకు పాల్పడుతున్నారని రైతులు చెబుతున్నారు. వైర్లను దొంగిలించడంతో సమయానికి నీరు అందక పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. వరుస దొంగతనాలు జరుగుతుండటంతో దీనిక వెనకాల పెద్ద ముఠా ఉంటుందని బాధిత రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



రాకొండ గ్రామంలో స్టార్టర్ నుంచి అపహరించిన కేబుల్

సాగు కష్టంగా మారుతోంది



బోరు మోటార్లు, వైర్లను అపహరిస్తుండటంతో పంటల సాగు కష్టంగా మారుతోంది. దొంగల వల్ల రెండేళ్ల కాలంగా రూ.6లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఐదు బోర్లలో చిన్న చిన్న రాళ్లను వేసి నాశనం చేశారు. ఈ విషయం పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలేదు. ఇప్పటికైనా దొంగలను పట్టుకునేందుకు చర్యలు చేపట్టాలి.

– కౌషిక్, రైతు, దోమ

మూడుసార్లు అపహరించారు



పొలంలోని బోరు మోటారు కేబుల్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు మూడుసార్లు దొంగిలించారు. స్టార్టర్ నుంచి బోరు వరకు వైర్ కట్ చేశారు. దీంతో సమయానికి నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. మార్కెట్‌లో కేబుల్‌ను కొనుగోలు చేసి మెకానిక్ సహాయంతో వేసుకోవాల్సి వస్తోంది. ఇప్పటి వరకు రూ.10 వేల మేర నష్టం వాటిల్లింది.

– బషీర్, రైతు, బొంపల్లి

అన్నను హత్యచేసిన కేసులో నిందితుడి రిమాండ్

మర్పల్లి: అన్నను హత్య చేసిన కేసులో నిందితుడిని శనివారం రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఆరు నెలల కిందట జరిగిన ఈ హత్య ఘటన వివరాలను ఎస్‌ఐ వివరించారు. మండల పరిధిలోని జంషాద్‌పూర్‌కు చెందిన మేతరి యాదయ్యకు దళిత బంధు పథకం కింద రూ.10 లక్షలు మంజూరు కావడంతో ట్రాలీ ఆటో తెచ్చుకొని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో యాదయ్య మద్యం సేవించి అన్న అశోక్‌తో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో మాట మాట పెరిగి ట్రాలీ ఆటోతో అన్నను ఢీ కొట్టాడు. దీంతో ఘటనా స్థలంలోనే అన్న మృతి చెందాడు. పోలీసులు వివరాలు సేకరించి 30 నవంబర్ 22న యాదయ్యపై హత్య నేరం కేసు నమోదు చేశారు. అయితే యాదయ్య ఆరు నెలల నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. పోలీసులు చాకచక్యంగా యాదయ్యను అదుపులోకి తీసుకోని పీఎస్‌కు తీసుకు వచ్చారు. కోర్టుకు రిమాండ్ చేసి జైలుకు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బెట్టింగ్ రాయుళ్ల అరెస్టు

మోమిన్‌పేట: ఐపీఎల్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న పలువురిని మోమిన్‌పేట్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వెంకటేశం తెలిపిన ప్రకారం.. శుక్రవారం రాత్రి 10గంటల ప్రాంతంలో స్థానిక ప్రాథమిక పాఠశాల సమీపంలో బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు దాడులు చేయగా ఐపీఎల్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఫోన్‌లను పరిశీలించగా మరో ముగ్గురితో బెట్టింగ్ సంబంధిత లావాదేవీలు నిర్వహించనట్లు గుర్తించారు. బెట్టింగ్‌కు వినియోగించిన 8 సెల్‌ఫోన్లు, రూ.90,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ప్రాచీన కళలను ప్రోత్సహిద్దాం



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ తదితరులు

దోమ: ప్రాచీన కళలను ప్రోత్సహించాలని అంబేడ్కర్ చేయూత ఫౌండేషన్ చైర్మన్ తుప్పలి ఆశోక్‌కుమార్ కోరారు. శనివారం మండల పరిధిలోని మోత్కుర్‌కు చెందిన పలువురు కళాకారులు కుల్కచర్ల మండల కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో నిర్వహిస్తున్న వీధి నాటకానికి ఆహ్వానిస్తూ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి మోత్కుర్‌లో ఆది చింతల మునిరంగ స్వామి వీధి నాటకాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీధి నాటకానికి తమవంతు సహకారం అందించాలని కళాకారులు కోరగా, వెంటనే స్పందించిన ఆయన రూ. 11 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో కళాకారులు అంజిలయ్య, సురేశ్, చంద్రయ్య, వెంకటయ్య, కృష్ణయ్య, మైసయ్య, పాపయ్య, వెంకటయ్య, శ్రీనివాస్, తిరుమలయ్య, సారంగి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలోనూ కాంగ్రెస్ విజయం ఖాయం

పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి

ధారూరు: త్వరలో జరిగే అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయఢంకా మోగించడం ఖాయమని పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి అన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై శనివారం సాయంత్రం పీసీసీ ప్రధాన కార్యదర్శి అధ్వర్యంలో పార్టీ నాయకులు విజయోత్సవ సంబరాలు జరుపుకొన్నారు. ముందుగా ప్రధాన రహదారిపై బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ పతనం ప్రారంభమైందని, బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందాలు ప్రజలకు తెలిసిపోయిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాజేశ్వర్, నాయకులు లింగనపల్లి అశోక్ ముదిరాజ్, మల్లేశ్ పాల్గొన్నారు.



ధారూరులో ప్రధాన రోడ్డుపై కాంగ్రెస్‌నాయకుల సంబరాలు

వీకెండ్ హోం.. సరదాగా గడిపేస్తాం

వీకెండ్ హోమ్స్‌పై పెరుగుతున్న ఆసక్తి

- పల్లెల్లో వ్యవసాయ క్షేత్రాల కొనుగోలు
- ఖర్చుకు వెనుకాడకుండా నిర్మాణాలు
- అభిరుచులకు తగ్గట్టు ప్రత్యేక సెట్టింగ్‌లు
- వారంలో ఒకటిరెండు రోజులు కుటుంబసమేతంగా ఎంజాయ్
- స్థానికులకు పెరుగుతున్న ఉపాధి అవకాశాలు



యాచారం-చౌదర్‌పల్లి మధ్యన ఓ వ్యాపారి నిర్మించుకున్న వ్యక్తిగత గృహం

యాచారం: ఉరుకులు పరుగుల జీవనం.. ఒత్తిడితో కూడిన విధులు నిర్వర్తిస్తున్న నగరవాసులు వీకెండ్‌లో ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపేందుకు మొగ్గు చూపుతున్నారు. రణగొణధ్వనులకు దూరంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందులో భాగంగా నగరానికి కాస్త దూరంగా వీకెండ్ హోమ్స్, వ్యక్తిగత గృహాలను నిర్మించుకుంటున్నారు. రోడ్డు మార్గం, రవాణా సౌకర్యం ఉన్న పల్లె ప్రాంతాల్లో ఎకరా వ్యవసాయ భూమిని రూ.30లక్షల నుంచి రూ.50 లక్షలకు పైగా కొనుగోలు చేస్తున్నారు. సకల సౌకర్యాలతో నిర్మాణాలను చేపడుతున్నారు. నిత్యం బిజీగా ఉండేవారు వీకెండ్‌లో తమ వ్యవసాయ పొలాల్లో నిర్మించిన వ్యక్తిగత గృహాల్లో కుటుంబ సమేతంగా సరదాగా గడుపుతున్నారు. యాచారం, మంచాల, మాడ్గుల మండలాల్లోని పలు గ్రామాల్లో వందలాదిగా వీకెండ్ హోమ్స్, వ్యక్తిగత గృహాలు ఊపందుకున్నాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.50 లక్షల నుంచి రూ.కోటికి పైనే ఖర్చు చేస్తుండడం విశేషం.

స్థానికులకు జీవనోపాధి

బడానేతలు, వ్యాపారవేత్తలు, ఉన్నతాధికారులు గ్రామాల్లో నిర్మించే వీకెండ్ హోమ్స్, వ్యక్తిగత గృహాలతో స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరిగాయి. వ్యక్తిగత గృహాలు, వీకెండ్ హోమ్స్‌కు యజమానులు వారానికో, పదిహేను రోజులకో వచ్చి వెళ్తున్నారు. యజమానులు ఉంటే పని.. లేదంటే ఆ ఇళ్లకు రక్షణగా ఉంటూ పలువురు స్థానికులు మంచి వేతనం పొందుతున్నారు. ఒక్కొక్కరు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు జీతాలు తీసుకుంటున్నారు. మరోవైపు నిర్మాణ పనుల్లోనూ స్థానికులకు పని దొరుకుతోంది.

ఆకట్టుకుంటున్న వ్యక్తిగత గృహాలు

పల్లెల్లో నిర్మిస్తున్న వ్యక్తిగత గృహాలు, వీకెండ్ హోమ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పండ్ల తోటల మధ్యన కనువిందు చేసే విధంగా కర్రలు, పక్షుల బొమ్మలు, జంతువుల చిత్రాలతో ఆకట్టుకుంటున్నాయి. యాచారం మండలం గడ్డమల్లయ్యగూడలోని గునుగల్-లోయపల్లి రోడ్డులో ఓ వ్యాపారవేత్త తన వ్యవసాయ క్షేత్రంలో రూ.50 లక్షలకు పైగా ఖర్చు చేసి నిర్మించుకున్న వ్యక్తిగత గృహం ఆ రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రయాణికులను ఆకర్షిస్తోంది. యాచారం-చౌదర్‌పల్లి గ్రామాల మధ్యన సాయిబాబా ఆలయం సమీపంలో నగరానికి చెందిన ఓ వ్యాపారవేత్త రూ.50 లక్షలతో ఇటీవల పూర్తి చేసుకున్న ఇంటి నిర్మాణం కనువిందుగా ఉంది. మొండిగౌరెల్లిలో రూ. కోటికి పైగా నిధులతో నాలుగు ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో ఆధునిక పద్ధతిలో వీకెండ్ హోమ్ నిర్మాణం సాగుతోంది. ఇంకా చాలా మంది ఆయా గ్రామాల్లో ఎకరా, రెండు ఎకరాల వ్యవసాయ పొలాన్ని కొనుగోలు చేసి వ్యక్తిగత గృహాల నిర్మాణాలకు సిద్ధమవుతున్నారు. నందివనపర్తి, యాచారం, మాల్, నల్లవెల్లి, తమ్మలోనిగూడ, గునుగల్, గడ్డమల్లయ్యగూడ తదితర గ్రామాల్లో వీకెండ్ హోమ్స్ నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.



గడ్డమల్లయ్యగూడలో ఆకట్టుకునేలా నిర్మించిన ఇల్లు

ఉత్సాహంగా గడుపుతాం..



గడ్డమల్లయ్యగూడలోని వ్యవసాయ క్షేత్రంలో ఆసక్తితో వ్యక్తిగత గృహాన్ని నిర్మించుకున్నాం. వ్యాపార రీత్యా ఎంత బిజీగా ఉన్నా.. ఎన్ని ఒత్తిడులున్నా వారానికి రెండు, మూడు రోజులు ఇక్కడికి వచ్చి సేదతీరుతాను. కొన్నిసార్లు స్నేహితులు, కుటుంబ సభ్యులతో వచ్చి సంతోషంగా గడిపి వెళ్తాం.

– గుండ్లపల్లి ప్రవీణ్ రెడ్డి, హైదరాబాద్

నెరవేరనున్న నిరుపేదల కల



లింగంపల్లి గేట్ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు

- త్వరలో డబుల్ ఇళ్ల పట్టాల పంపిణీ
- లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక
- కలెక్టర్‌కు నివేదిక పంపిన అధికారులు

మంచాల: నాలుగున్నర సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాల పంపిణీ త్వరలో పూర్తికానుంది. ఇప్పటికే లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపికను పూర్తిచేశారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంచాల మండలంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం కోసం నోముల రెవెన్యూ పరిధిలోని లింగంపల్లి గేట్ వద్ద నాలుగున్నర సంవత్సరాల క్రితం 100, 101 సర్వే నంబర్లలో 2.00 ఎకరాల స్థలం గుర్తించారు. అందులో ఇప్పటికే 96 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. అప్పట్లో ఇళ్లులేని నిరుపేదలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దీంతో నోముల గ్రామంలో 85, మంచాల గ్రామంలో 276, లింగంపల్లి గ్రామంలో 96 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా మొత్తంగా 460 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

లాటరీ పద్ధతిలో ఎంపిక..

ఇళ్ల నిర్మాణం చేసి ఏడాదిన్నర దాటినా లబ్ధిదారుల ఎంపిక అధికారులకు సమస్యగా మారింది. చివరికి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయడానికి అధికారులు నిర్ణయించారు. గ్రామాలవారీగా దరఖాస్తు చేసుకున్న వారిలో ఆర్థిక స్థితిగతులు, గతంలో ఇళ్లు వచ్చాయా అనే కోణంలో విచారణ చేసి జాబితాను తయారుచేశారు. గ్రామసభల ద్వారా లాటరీలు తీసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. 96 ఇళ్లల్లో నోముల 30, లింగంపల్లి 30, మంచాల 30 ఇళ్లు ఇవ్వగా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయి చెన్నారెడ్డిగూడ గ్రామానికి చెందిన 5 మందికి 5 ఇళ్లు ఇచ్చారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతకు ఒక ఇల్లు కేటాయించారు. ఇలా మంచాల మండలంలో 96 డబుల్ బెడ్‌రూం ఇళ్లు ప్రశాంతంగా ఏలాంటి గొడవలు లేకుండా ఎంపిక పూర్తి చేశారు.ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ నమోదు చేసి కలెక్టర్ ఆదేశానుసారంగా త్వరలోనే ఇళ్ల పట్టాల పంపిణీ చేయనున్నారు. అయితే గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం చాలామంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయడంతో ఆశపడ్డ వారికి నిరాశే మిగిలింది. లాటరీ పద్ధతి ద్వారా తమకు న్యాయం జరగలేదని చాలామంది నిరుపేదలు నిరాశలో ఉన్నారు.

ఎమ్మెల్యే మంచిరెడ్డి కృషి ఫలితమే



మంచాల మండలంలోని నోముల, లింగంపల్లి, మంచాల గ్రామాల్లో నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు వస్తున్నాయంటే అది స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కృషి ఫలితమే. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పనులను వేగవంతం చేయించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల తరపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

– దండేటికార్ రవి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, నోముల

త్వరలో పట్టాల పంపిణీ



లాటరీ పద్ధతిలో పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాం .మండల పరిధిలోని డబుల్ ఇళ్ల లబ్ధిదారుల వివరాలు కలెక్టర్‌కు నివేదిక రూపంలో పంపించాం. వారి ఆదేశానుసారం త్వరలో పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తాం.

– అనిత, తహసీల్దార్, మంచాల

ఘనంగా పల్లకీ సేవ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం కౌన్సిలర్ లతాశ్రీ, శ్రీశైలంగౌడ్ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకీ సేవ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు పల్లకీ మోస్తూ భక్తి పాటలు, ఆటలతో స్వామివారిని ఊరేగించారు. అనంతరం వసంతరావు, సీతామహాలక్ష్మి దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలంగౌడ్, ప్రభాకర్, సతీష్, రమేష్, రఘునందన్‌రెడ్డి, లక్ష్మణ్, కిషన్‌నాయక్, శ్రీనివాస్, కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణాచారి, శంకర్‌గౌడ్, పద్మవెంకటేశ్, గోరియానాయక్ ఆలయ అర్చకులు రఘుపతిరావు, ప్రమోద్, సునీల్ పాల్గొన్నారు.

చకచకా ఫాక్స్‌కాన్ పనులు



సాగుతున్న పనులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎలక్ట్రానిక్ దిగ్గజం ఫాక్స్‌కాన్ భూమిపూజ పనులు చకచకా సాగుతున్నాయి. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్‌లో కలెక్టరేట్ ఎదుట ఫాక్స్‌కాన్ కంపెనీకి 196 ఎకరాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నెల 15న ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా పునాదిరాయి వేయనున్నారు. ఇందు కోసం తైవాన్ కంపెనీ ప్రతినిధులు దగ్గరుండి పనులు పర్యవేక్షిస్తున్నారు. భూమిపూజ చేసే వేదిక, సభాస్థలి, భోజన శాలలను సిద్ధం చేస్తున్నారు. శనివారం మహేశ్వరం డీసీపీ చింతమనేని శ్రీనివాస్ పనులను పరిశీలించారు.



లోపలి భాగం